క్లుప్తంగా

జిల్లా స్థాయి హాకీ జట్టుకు విద్యార్థుల ఎంపిక



హాకీ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

చిట్యాల : పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు హాకీ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ గంగాపురం రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ అండర్-17 విభాగంలో కె.అఖిల్‌నందన్, పి.అశ్విత, అండర్-14 విభాగంలో కే.నరేశ్‌కుమార్, ఎస్.యశ్వంత్, అండర్-14 బాలికల విభాగంలో ఎస్.అయేషా, జె.రమ్య స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ బండ వీణా అనిల్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి, ఏఓ పోలా గోవర్ధన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆసరా పింఛన్ల పంపిణీ



ఆసరా పింఛన్ అందజేస్తున్న సిబ్బంది

మర్రిగూడ : మండల వ్యాప్తంగా ఆసరా పింఛన్ల పంపిణీ జరగకపోవడంతో సాక్షి దినపత్రికలో 'ఆసరా పింఛన్లు అందక లబ్ధిదారుల అవస్థలు' అనే కథనం బుధవారం ప్రచురితమైంది. స్పందించిన పోస్టాఫీసు అధికారులు, సిబ్బంది ఆసరా పింఛన్లను అందించడం ప్రారంభించారు. పింఛన్ల పంపిణీకి డీఆర్‌డీఏ అధికారులు ఇచ్చిన గడువు ఈ నెల 23 వరకు ఉండగా మరో మూడు రోజులు పొడిగించనున్నట్లు పోస్టాఫీసు సిబ్బంది తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామంలో ఇటీవల మరణించిన కత్తుల లక్ష్మమ్మ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు జీడిపల్లి వెంకట్‌రెడ్డి బుధవారం పరామర్శించి బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లోడంగి గోవర్దన్, సర్పంచ్ ఎస్‌కె.మోయిజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యనారాయణ, చిరంజీవి, శ్రీను, సాయిలు, రవి తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

కట్టంగూర్ : ఎంపీటీసీ ఫోరం కట్టంగూర్ మండల అధ్యక్షుడు, పిట్టంపల్లి గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు పాలడుగు హరికృష్ణ బుధవారం నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

కోమటిరెడ్డి సతీమణి, కూతురు ప్రచారం

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం ఆయన సతీమణి సబిత, కూతురు శ్రీనిధి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. నల్లగొండలోని 20వ వార్డు గొల్లగూడ, పెద్ద బండ, ఎస్సీ కాలనీల్లో కోమటిరెడ్డి సతీమణి, 30వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో కూతురు ఇంటింటి ప్రచారం చేపట్టారు. నాంపల్లి భాగ్య నరసింహ, కౌన్సిలర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, అల్లి సుభాష్ యాదవ్, సూరెడ్డి సరస్వతి, కేసాని కవిత, ఎగ్గడి సుజాత, ప్రీతి ప్రశాంతి, జూలకంటి స్వాతి, శంకర్, సల్మాన్, తబ్రేజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి

మర్రిగూడ : మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు మెండు దీపికరెడ్డి ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో బుధవారం మునుగోడులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిట్టగోని ధనుంజయ, జాల గణేశ్, ఎడ్ల భిక్షమయ్య, ముంత పెద్దయాదయ్య, హనుమంతు, చినయాదయ్య, సత్తయ్య, వెంకులు, మల్లేష్, భిక్షమయ్య, అంజయ్య, ముత్యాలు, రాములు, ఎల్లారెడ్డి, లక్ష్మీపతి, రామస్వామి, చిన సత్తయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాటక ప్రదర్శన

మిర్యాలగూడ టౌన్ : ప్రముఖ కళాకారుడు పులి శేషయ్య స్మారక వార్షికోత్సవం సందర్భంగా మిర్యాలగూడ సాంస్కృతిక వేదిక, త్యాగరాజ నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన 'శ్రీరామాంజనేయ యుద్ధం'పౌరాణిక నాటక ప్రదర్శన మంగళవారం రాత్రి ముగిసింది. నంది అవార్డు గ్రహీత తడకమళ్ల రామచందర్‌రావు రచించిన'రావణ'నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ నాటక ప్రదర్శనకు ముందు కాటేపల్లి లక్ష్మినర్సింహామూర్తి అష్టావదాన కార్యక్రమం ఆకట్టుకుంది. ముగింపు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళారంగం కనుమరుగవుతున్న తరుణంలో ఈ బృందం కళారంగాన్ని కాపాడుకుంటూ జీవం పోస్తోందన్నారు. అనంతరం పురుషోత్తమాచార్యులు, సాయి, శివసుబ్రమణ్యం, రమణ, కాటేపల్లి లక్ష్మినర్సింహమూర్తి, వెంగమాంబ, రమణ, జానకిరామశర్మలతోపాటు పలువురిని ఘనంగా సత్కరించారు.

పశువులకు తప్పని గ్రాసం కొరత

- ఇతర మండలాల నుంచి కొనుగోలు
- ట్రాక్టర్ గడ్డికి రూ.10వేలకు పైనే..
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు



ఇతర మండలాల నుంచి ట్రాక్టర్‌లో గడ్డిని తరలిస్తున్న మర్రిగూడ మండల రైతులు

మర్రిగూడ : మండలంలోని పలు గ్రామాల్లో పాడి రైతులు తమ పశువులకు గ్రాసం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఇతర మండలాల నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వెచ్చించి గ్రాసం కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మర్రిగూడ మండల వ్యాప్తంగా 4,283 పశువులు, 3,082 గేదెలు, 21,006 గొర్రెలు, 12,497 మేకలు ఉన్నాయి. ప్రతి ఏడాది ఈ పశువులకు సరిపడా గ్రాసం అందకపోవడంతో వేసవికాలంలో చండూరు, కనగల్ ఇతర దూర ప్రాంతాల నుంచి గ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోందని పాడి రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఈ ఏడాది మూడున్నర టన్నుల గడ్డి విత్తనాలు సరఫరా చేసినట్లు పశువైద్యులు చెబుతున్నారు.

పూర్తిస్థాయిలో అందని వైద్య సేవలు

మర్రిగూడ మండల కేంద్రంతోపాటు శివన్నగూడ పశు వైద్యశాలలో పశువైద్యులు, ఇన్‌చార్జ్‌లతోపాటు అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్‌లు ఉన్నారు. అటెండర్లు, స్వీపర్లు, సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారికి అధిక పనిభారం తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి సరిపడా పశువైద్య సిబ్బందిని నియమించాలని ఆయా గ్రామాల పాడి రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టు పూర్తయితే పరిష్కారం..

శివన్నగూడ ప్రాజెక్టు పూర్తయితే మర్రిగూడ మండలంతోపాటు సమీప మండలాలైన గట్టుప్పల్, చండూరు, మునుగోడు, కనగల్, నల్లగొండ వరకు వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. దీంతో సాగు విస్తీర్ణం పెరిగి పశువులకు గ్రాసం కొరత తీరుతుంది. 8 ఏళ్ల క్రితం ఈ ప్రాజెక్టుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. కానీ పనులు నత్తనడకన సాగుతుండడంతో నేటికీ పూర్తి కాలేదు.

మా ప్రాంతంలో నీరు తక్కువగా ఉంది



కనగల్ మండలం నుంచి ట్రాక్టర్ గడ్డిని రూ.10వేలకు కొనుగోలు చేశా. ఉన్న పాడి గేదెలను సాకాలంటే గడ్డి కొనుగోలు చేయక తప్పదు. మా ప్రాంతంలో నీరు తక్కువగా ఉంది. ప్రాజెక్టు పూర్తయితే గడ్డి కొనుగోలు చేయడం తప్పుతుంది.

–వడ్డె రవి, రాంరెడ్డిపల్లి

మూడున్నర టన్నుల విత్తనాలను సరఫరా చేశాం



ఈ ఏడాది పాడి రైతులకు పచ్చి గడ్డి కోసం దాదాపు మూడున్నర టన్నుల గడ్డి విత్తనాలను సరఫరా చేశాం. గ్రాసం కొరత అధిగమించేందుకు రైతులు ముందస్తు ప్రణాళిక ఏర్పరుచుకుని పాడి పశువులను సంరక్షించుకోవాలి. రెండు టన్నులకు ఇండెంట్ పెట్టాం. త్వరలో గడ్డి విత్తనాలు రానున్నాయి.

–రమావత్ స్వామినాయక్, ఇన్‌చార్జ్ పశువైద్యుడు, మర్రిగూడ

కూసుకుంట్ల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



చండూరు : బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు : మున్సిపల్ కేంద్రానికి చెందిన పలువురు బీజేపీ ముఖ్య కార్యకర్తలు, యువకులు బుధవారం కొత్తపాటి సతీష్, కౌన్సిలర్ గుంటి వెంకటేశం ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జిట్టగోని బాలు, పగిళ్ల శివ, వేముల పవన్, గురిజ శివ, పగిళ్ల పవన్, కల్లెట్ల సురేష్, రమేష్, నలపరాజు శంకర్, పోలోజు సురేష్, సాయి, భూక్యా సైదులు, సురిగి శ్రీధర్, చెరిపల్లి వేణు, తలారి సాయి తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తోకల వెంకన్న, అన్నెపర్తి శేఖర్, కోడి వెంకన్న, జిల్లా నాయకులు ఝుత్తపు మధుసూదన్ రావు, అన్నెపర్తి యాదగిరి, ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గట్టుప్పల మండల కేంద్రంలో పలు పార్టీల నాయకులు జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బండారు చంద్రయ్య, వారు శ్రీనివాస్, పున్న కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మర్రిగూడ : మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు మాజీ ఎంపీపీ అనంతరాజుగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చౌటుప్పల్‌లో మునుగోడు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ఏర్పుల అంజయ్య, ఐతగోని వెంకటయ్య, నాయకులు రాజు, లింగస్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను ఉపసంహరించుకోవాలి

రామగిరి(నల్లగొండ): బీసీ 'డి' లో ఉన్న ముదిరాజ్‌లను బీసీ 'ఏ' లో కలిపేందుకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రదేశ్ గంగపుత్ర యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడెం రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గంగపుత్ర సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పాలనలో జారీ చేసిన జీఓ 15, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీఓ 6 ద్వారా గంగపుత్రులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గంగపుత్రులు వెంటనే ఆ రెండు పార్టీలకు రాజీనామా చేసి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడెం సతీష్‌కుమార్, మునాస సతీష్, మునాస శ్రీను, గంగుల శ్రీను, అంబటి రాజు, అంబటి పృథ్వి, మునాస గిరిబాబు, మునాస మధు, గుండు నాగరాజు, గుండు రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తేనే సంక్షేమ ఫలాలు

కట్టంగూర్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం అన్నారు. బుధవారం కట్టంగూర్‌లో మాజీ ఎమ్మెల్సీ నేతి విద్యాసాగర్, ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్యతో కలిసి నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. అదే విధంగా చెర్వుఅన్నారం, గార్లబాయిగూడెం, కురుమర్తి, అక్కలాయిగూడెం గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి వెంకటమ్మసాగర్, కొండ లింగస్వామి, పూజర్ల శంభయ్య, సర్పంచ్ చెనగోని సతీష్, యాతాకుల అంజయ్య తదితరులున్నారు.

చిరుమర్తి ఎన్నికల ప్రచారం

నకిరేకల్ : మున్సిపాలిటీలోని పలువార్డుల్లో బుధవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, వార్డు కౌన్సిలర్ కందాల భిక్షంరెడ్డి, పాల్గొన్నారు.

చిట్యాల: పేద ప్రజలందరికి సంక్షేమ పథకాలను అందించే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని నకిరేకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య కోరారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, ఎంపీపీ కొలను సునిత, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ, ఎంపీటీసీ పెద్దబోయిన సత్తయ్య, సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆవుల అయిలయ్య, కల్లూరి మల్లారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఉయ్యాల నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండమల్లేపల్లి : ఎన్నికల నేపథ్యంలో బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో పోచంపల్లి రవీందర్‌రెడ్డి అనే వ్యక్తి నాంపల్లికి రెండు కాటన్ల బీరు బాటిళ్లను తీసుకెళ్తుండగా హైదరాబాద్ రోడ్డులో పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.3600 ఉంటుందని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

సుస్థిర పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి అభ్యర్థి మందుల సామేల్



శాలిగౌరారం : మాధారంకలాన్ గ్రామంలో మాట్లాడుతున్న మందుల సామేల్

శాలిగౌరారం : సుస్థిర పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని ఇటుకులపహాడ్, మాధారంకలాన్, వంగమర్తి, చిత్తలూరు, తుడిమిడి, గురుజాల, రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, అడ్లూరు, వల్లాల, ఆకారం, బండమీదిగూడెం, ఊట్కూరు, పెర్కకొండారం గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నేతలు మూసీనదిలోని ఇసుకను కొల్లగొట్టి వేలకోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడ్డారన్నారు. ఇసుక మాఫియాతో మూసీ పరివాహక ప్రాంతం భూములు నీళ్లులేక బీళ్లుగా మారే ప్రమాదం ఏర్పడిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించి బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాళ సమరంరెడ్డి, ఎన్నికల నిర్వాహణ మండల అధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నోముల వెంకన్న, జనార్దన్, రవి, అల్లి సైదులు, బెల్లి వీరభద్రం, పాదూరి శంకర్‌రెడ్డి, బొమ్మగాని రవి, బండపల్లి కొమరయ్య, ఆకుల శ్రీను, మొగుళ్ళ శ్రీను, నక్క మల్లేష్, మారం వేణుగోపాల్‌రెడ్డి, పాక మల్లేష్, గర్దాసు లింగయ్య, మాతంగి శ్రీను, చాడ సురేశ్ రెడ్డి, గోదల నరేందర్‌రెడ్డి, దండ అశోక్‌రెడ్డి, చింత ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో కాషాయ జెండా ఎగరాలి

- బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి



మర్రిగూడ : ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

మర్రిగూడ : ప్రజల ఆశీర్వాదంతో మునుగోడు నియోజవకర్గంలో కాషాయ జెండా ఎగరాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మర్రిగూడ మండలంలోని కొండూరు, యరగండ్లపల్లి, అజ్జిలాపురం, తిరగండ్లపల్లి, తమ్మడపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు అవకాశం ఇచ్చి గెలిపించారని, ఈసారి తనకు అవకాశం ఇచ్చి అసెంబ్లీకి పంపిస్తే ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, యాస అమరేందర్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, గ్యార గోపాల్, చలమల్ల వినీత్‌రెడ్డి, రాజేందర్‌నాయక్, మామిడి పరుశురాం, గ్యార యాదగిరి, చిట్యాల యాదగిరిరెడ్డి, జిల్లా కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో కారింగు దేవేందర్, మాదగోని వెంకటేష్, ఐతగోని నవీన్, పాగాకు రమేష్, కోరెంక ఫణీంద్రవర్మ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే పేద ప్రజల అభివృద్ధి

మునుగోడు : బీజేపీతోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమని మునుగోడు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి సతీమణి రజిత అన్నారు. మునుగోడు మండలంలోని కొంపల్లి, చీకటిమామిడి, మునుగోడు గ్రామాల్లో బుధవారం ఆమె ఇంటింటి ప్రచారం చేపట్టారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి తన భర్త చలమల్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వేదాంతం గోపీనాథ్, దర్శనం వేణు, బొడ్డు నాగరాజు గౌడ్, సురిగి నర్సింహగౌడ్, బొడిగే అశోక్‌గౌడ్, కర్నాటి లింగయ్య, మాదగోని నరేందర్ గౌడ్, జిట్టగోని కృష్ణకుమార్ పాల్గొన్నారు.

కనులపండువగా కంఠమహేశ్వరస్వామి కల్యాణం



ఆలయం వద్దకు జల బిందెలతో వెళ్తున్న గ్రామస్తులు

కేతేపల్లి : గీత కార్మికుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వస్వామి, సూరమాంబదేవిల కల్యాణ వేడుకలను బుధవారం కేతేపల్లిలో కనులపండువగా నిర్వహించారు. రెండు రోజుల పాటు సాగే వేడుకల్లో భాగంగా మొదటి రోజు బుధవారం మహిళలు, మాలధారణ స్వాములు జల బిందెలతో స్థానిక నిమ్మలమ్మ చెరువు సమీపంలో ఉన్న ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ఆవరణలో శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం మహిళలు బోనం గంపలను నెత్తిన పెట్టుకుని ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి దేవతామూర్తుల విగ్రహాలను ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉంచి వేద పండితుల మంత్రోచ్చారణలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న పాలక పక్షాలు



చిట్యాల : మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

చిట్యాల : ఈ ఎన్నికల్లో ధన ప్రభావంతో రాజకీయాలు చేస్తున్న పాలక పక్షాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాలలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, మండల రూరల్ కార్యదర్శి అర్రూరి శ్రీనివాసులు, శీలా రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను గెలిపించాలి

కట్టంగూర్ : కార్మికులు, పేద ప్రజల హక్కుల రక్షణ కోసం పోరాడుతున్న సీపీఎం అభ్యర్థులను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ కోరారు. బుధవారం కట్టంగూర్ మండలంలోని బొస్కర్లబావి, పిట్టంపల్లి, ఇస్మాయిల్‌పల్లి గ్రామాలలో నకిరేకల్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి బొజ్జ చినవెంకులుకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, ఎల్.రాజు, యన్న నర్సిరెడ్డి, రామస్వామి, మోహన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న చాడ కిషన్‌రెడ్డి తదితరులు

శాలిగౌరారం : తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిశోర్‌కు ఓటు వేయాలని కోరుతూ బుధవారం మండలంలోని తిరుమలరాయునిగూడెంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గౌర వీరయ్య, పడాల సత్తయ్య, భిక్షం, వెంకన్న, లింగయ్య, అంతయ్య పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతాలు



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): కార్తీక మాసం సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్‌లో గల శ్రీ వాసవీమాత శ్రీ ఉమామహేశ్వరస్వామి సహిత శ్రీరామకోటి స్తూప ఆలయంలో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య సలహాదారుడు సోమవరపు రాజేశ్వర్‌రావు, ఆలయ చైర్మన్ బండారు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అర్రూరు సత్యనారాయణ, కోశాధికారి గుడిపాటి సత్యనారాయణ, శివకోటి నెహ్రూ, నాగయ్య, వనమా మనోహర్ పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తే బీసీ ముఖ్యమంత్రి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వస్తే బీసీ వ్యక్తి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారని బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని న్యూప్రేమ్ టాకీస్ సమీపంలో హమాలీ కార్మికుల అడ్డ వద్ద, పానగల్ రోడ్ 18, 19వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌గౌడ్ సతీమణి ప్రచారం

మాదగాని శ్రీనివాస్‌గౌడ్ సతీమణి విజయలక్ష్మి బుధవారం 36వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.భవాని, హైమావతి, తార, కవిత, దేవి, సరిత, నవత తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్ల కోసం తప్పని పడిగాపులు

- ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినా తిప్పించుకుంటున్న పోస్టాఫీసు సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు



పింఛన్ కోసం మునుగోడు పోస్టాఫీస్ వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

మునుగోడు : ప్రభుత్వం ప్రతినెలా అందిస్తున్న ఆసరా పెన్షన్లు పొందేందుకు వృద్ధులకు, దివ్యాంగులకు పడిగాపులు తప్పడం లేదు. ఐదు రోజుల క్రితమే ప్రభుత్వం ఆసరా పెన్షన్లు పంపిణీ చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించినా మునుగోడులోని లబ్ధిదారులకు నేటికీ పింఛన్ అందలేదు. నాలుగు రోజులుగా లబ్ధిదారులు ఉదయాన్నే మునుగోడు మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌తోపాటు వివిధ గ్రామాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూసి ఇంటిబాట పడుతున్నారు.

6173 మంది లబ్ధిదారులు..

మునుగోడు మండలంలోని 26 గ్రామాల్లో మొత్తం 6173 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతినెలా ఆసరా పెన్షన్లు అందిస్తోంది. అందులో వృద్ధులు 2212 మంది, వితంతువులు 2212, ఒంటరి స్త్రీలు 172, దివ్యాంగులు 1164, గీతకార్మికులు 576, నేత కార్మికులు 119 మంది చొప్పున ఉన్నారు.

చిల్లర రూ.4 ఇవ్వకుంటే రూ.16 కట్..

ప్రభుత్వం వృద్ధులకు రూ.2016, దివ్యాంగులకు రూ.4016 ఆసరా పింఛన్ అందిస్తోంది. లబ్ధిదారులు రూ.4 చిల్లర ఇస్తేనే పూర్తిస్థాయిలో పింఛన్ డబ్బులు అందిస్తున్నారు. లేకుంటే వృద్ధులకు రూ.2వేలు, దివ్యాంగులకు రూ.4వేలు ఇచ్చి పై రూ.16 ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతోపాటు ఆవాస గ్రామాల్లోకి వెళ్లి పింఛన్ ఇవ్వాలంటే ఒక్కొక్కరి వద్ద రూ.50 నుంచి రూ.100 వసూలు చేస్తున్నారని, అలా ఇవ్వకుంటే గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చినవారికి మాత్రమే ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతినెలా సకాలంలో పెన్షన్ డబ్బులు ఇచ్చేలా చూడాలని, రూ.16 తీసుకుంటున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆసరా పింఛన్ లబ్ధిదారులు కోరుతున్నారు.

నాలుగు రోజులుగా వచ్చిపోతున్నాం



నాలుగు రోజులుగా పింఛన్ కోసం మునుగోడు పోస్టాఫీసుకు వచ్చిపోతున్నాం. పింఛన్ ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదు. ఉదయం నుంచి 12 గంటల వరకు ఇక్కడే కూర్చుని పోతున్నాం. మా గ్రామం నుంచి మునుగోడుకు వచ్చేపోయేందుకు రోజుకు రూ.50 ఖర్చు అవుతోంది.

– ముత్తయ్య, రావిగూడెం

చిల్లర ఇవ్వకుంటే రూ.16 ఇవ్వడం లేదు



మాకు ప్రభుత్వం అందిస్తున్న రూ.2016 నిండా ఇవ్వడం లేదు. రూ.2వేలు ఇచ్చి పొమ్మంటున్నారు. పై రూ.16 అడిగితే మీ దగ్గర రూ.4 చిల్లర ఉంటే ఇస్తే ఇస్తాం, లేదంటే ఇవ్వమని కోపంగా చెబుతున్నారు. దీంతో కొందరం పై రూ.16 తీసుకోకుండా వెళ్తున్నాం.

–సముద్రాల లక్ష్మమ్మ, మునుగోడు